
సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
సోమవారం । 18 । ఆగస్టు । 2025



24,087 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

సోమశిలకు ఆదివారానికి 24,087 క్యూసెక్కుల వరద వస్తోంది. డెల్టాకు 1850, ఉత్తర కాలువకు 340, కండలేరుకు 8150 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	రూ.1,02,720
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.9,275
మూడు శాతం జీఎస్టీతో	రూ.9,553
నవర (8 గ్రాములు)	రూ.76,424

వాతావరణం

గరిష్టం/కనిష్టం
28.8 /24.5

జిల్లాలో సోమవారం వాతావరణం మేఘావృతంగా ఉంటుంది. ఉక్కపోత ఎక్కువగా ఉండే అవకాశం ఉంది. గాలిలో ఆదివారం తేమ 82 శాతంగా నమోదైంది.

న్యూస్‌రీల్

పంచాయతీరాజ్ విభాగ రాష్ట్ర కార్యదర్శిగా మోహన్‌కృష్ణ

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు కోవూరు నియోజకవర్గానికి చెందిన అడపాల మోహన్‌కృష్ణను పార్టీ రాష్ట్ర పంచాయతీరాజ్ విభాగ కార్యదర్శిగా నియమిస్తూ ఆదివారం పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ఉత్తర్వులు జారీ చేశారు.

అర్జీల పరిష్కార సమాచారానికి కాల్ సెంటర్


నెల్లూరురూరల్ : ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో జరిగే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చే వినతుల పరిష్కార సమాచారం కోసం ప్రత్యేకంగా కాల్ సెంటర్ ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ ఓ ఆనంద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి సోమవారం జిల్లా కేంద్రంతోపాటు అన్ని మండల కేంద్రాలు, మున్సిపల్ కార్యాలయాలు, డివిజనల్ స్థాయిలో కూడా ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం జరుగుతుందని, ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కలెక్టర్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. అర్జీదారులు తమ దరఖాస్తు పరిష్కారం కాకున్నా, పరిష్కారం ఏ దశలో ఉందో సమాచారం తెలుసుకోవడానికి కాల్ సెంటర్ నంబర్ 1100కు ఫోన్ చేయాలని కలెక్టర్ తెలిపారు.

మద్యం, మైనింగ్ మాఫియాల ఆగడాలను అరికట్టాలి

మార్కాపురం: రాష్ట్రంలో మద్యం, మైనింగ్ మాఫియాల ఆగడాలను అరికట్టాలని ప్రజా సంకల్ప వేదిక జాతీయ అధ్యక్షుడు మధిర రంగసాయిరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం మార్కాపురంలోని వారి కార్యాలయంలో దక్షిణ కోస్తా జిల్లాల ముఖ్య నాయకులతో విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం రాష్ట్రంలో జరుగుతున్న అవినీతిని నిర్మూలించేందుకు అందరూ ముందుకు రావాలని అన్నారు. రాజకీయ చైతన్యంతోనే రాజ్యాంగ ఫలాలు అన్నీ వర్గాలకు అందుతాయన్నారు. గ్రామ స్థాయి నుంచి ప్రజా సంకల్పవేదికకు పునాదులు వేయాలన్నారు. మార్కాపురం మెడికల్ కాలేజీ శిథిలావస్థకు చేరుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. వెలుగొండ ప్రాజెక్ట్ పనులు నత్తనడకన సాగుతున్నాయన్నారు.

మినిస్టర్.. కుర్చీ.. కహానీ

- మంత్రి పదవికి సింహపురి తమ్ముళ్ల పొలిటికల్ డ్రామాలు
- ఎమ్మెల్యేలు సోమిరెడ్డి, వేమిరెడ్డి, కోటంరెడ్డి వ్యూహ ప్రతివ్యూహాలు
- మైనింగ్ నుంచి తప్పుకొంటానని ఎంపీ వేమిరెడ్డి ప్రకటన వెనుక రాజకీయ ప్రయోజనం
- తన సతీమణికి మంత్రి పదవి కోసమే ఈ ఎత్తుగడ
- మాఫియాను నడిపిస్తోందే ఆయనే
- వాటాలపై ఎమ్మెల్యేలతో పేచీ
- శాసనసభ్యులతో సోమిరెడ్డి విందు రాజకీయాలు
- మరో వైపు 'చివరి అవకాశం' అంటూ కోటంరెడ్డి అభ్యర్థన
- మరో అమాత్యుడు తన పదవిని కాపాడుకునేందుకు పాట్లు



జిల్లాలోని మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు అధికారం చేజిక్కిన మరుక్షణం నుంచి అవినీతి, అక్రమాల్లో మునిగితేలిపోతున్నారు. ఏడాది కాలంలోనే అప్రతిష్ట మూటగట్టుకున్నారు. అక్రమ సంపాదన కోసం ఎవరికి వారు సహచర ప్రజాప్రతినిధులతోనే విభేదించారు. ఎవరికి వారే యమునా తీరే అన్నట్లుగా వ్యవహరించారు. అరాచకాలను ప్రోత్సహించడం, పోలీసులను అడ్డం పెట్టుకుని ప్రతిపక్షంపై అక్రమ కేసులను బనాయించడం వంటి పరిణామాలతో ప్రజల్లో గ్రాఫ్ పాతాళానికి పడిపోతుంది. ఈ క్రమంలో త్వరలో మంత్రివర్గ విస్తరణ జరిగే అవకాశాలు ఉండడంతో పదవుల కోసం తమ్ముళ్లు పొలిటికల్ డ్రామాలకు తెరతీశారు.

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: అధికార పార్టీలో 'రాజకీయ' ఆట మొదలైంది. త్వరలో జరిగే మంత్రి వర్గంలో స్థానం సంపాదించడం, అధిష్టానం వద్ద మెప్పు కోసం కొందరు, ఉన్న మంత్రి పదవిని కాపాడుకునేందుకు మరొకరు సింహపురి తమ్ముళ్లు పొలిటికల్ డ్రామాలాడుతున్నారు. జిల్లాలో ఇప్పటికే ఇద్దరికి మంత్రి పదవులు కట్టబెట్టింది. అయితే వీరిలో అధిష్టానంలో కీలక పాత్ర పోషిస్తున్న ఓ మంత్రి పదవికి ఎలాంటి గండం లేకపోయినా.. మరో మంత్రికి పదవీ గండం ఉందని రాజకీయ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. ఆ స్థానాన్ని దక్కించుకునేందుకు జిల్లా నుంచి పార్టీకి పాతకాపు అయిన సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డితోపాటు మొన్నటి ఎన్నికలకు ముందు ఆ పార్టీలోకి ఫిరాయించిన వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి దంపతులతోపాటు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పావులు కదుపుతున్నారు.

ఒక్కొక్కరిదీ ఒక్కో తీరు

కూటమి అధికారంలోకి వచ్చాక మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీ ఎవరికి వారు ఇసుక, మైనింగ్‌లో ఎవరికి వారేగా అక్రమాలకు బరితెగించారు. సహచర ప్రజాప్రతినిధులతోనే విభేదించారు. 'మా నియోజకవర్గంలో మీరు తలదూర్చవద్దు.. మీ నియోజకవర్గంలో మేం తలదూర్చమంటూ' నిప్పు, ఉప్పులా ఉన్నారు. తాజాగా మంత్రి వర్గ విస్తరణ జరుగుతుందన్న ప్రచారం ఊపందుకోవడంతో ఒకాయన మెజార్టీ ఎమ్మెల్యేలను ప్రసన్నం చేసుకుని తనకు ఆ పదవి వచ్చేలా ప్రతిపాదించాలని విందు రాజకీయానికి తెరతీశారు. తన సతీమణికి మంత్రి పదవి కోసం ఏకంగా ఎంపీ వేమిరెడ్డి తనదైన శైలిలో పావులు కదుపుతూనే కొత్త డ్రామా స్టార్ట్ చేశారు. ఏడాదిగా జిల్లా వ్యాప్తంగా ఉన్న మైన్లపై వేమిరెడ్డి పెత్తనం చేయడంతో స్థానిక ఎమ్మెల్యేలతో వాటాలపై అంతర్గత విభేదాలు మొదలయ్యాయి. ఈ పరిణామాలు తన సతీమణి పదవికి అడ్డంకిగా మారుతాయనే ఇటీవల ఆయన మైనింగ్ వల్ల తన ప్రతిష్ట దిగజారిపోయిందని, ఇందులో తన పాత్ర ఏమీ లేదంటూ.. ఇకపై కూడా మైనింగ్‌తో తనకు ఎలాంటి సంబంధం లేదంటూ, తప్పుకుంటున్నానని హడావుడిగా మీడియా ముఖంగా ప్రకటన చేశారు. మరో ఎమ్మెల్యే మంత్రి పదవి తన చివరి కోరిక అంటూ సెంటిమెంట్ మైండ్‌గేమ్ స్టార్ట్ చేశారు.

వేమిరెడ్డి గ్రాఫ్ పాతాళానికి..



జిల్లాలో అపర కుబేరుడిగా కీర్తించబడుతున్న వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి గ్రాఫ్ ఏడాది కాలంలో పాతాళానికి పడిపోయింది. ఎన్నికల వేళ పార్టీ ఫిరాయించి కూటమిలో చేరిన వేమిరెడ్డి నెల్లూరు ఎంపీగా విజయం సాధించారు. ఏడాది ముందు జరిగిన ఎన్నికల ఖర్చు కోసం ఆయన్ను కీర్తించిన ఎమ్మెల్యేలే ఇప్పుడు దూరంగా పెడుతున్నారు. కూటమి అధికారంలోకి వచ్చాక జిల్లాలో మైనింగ్‌ను తన గుప్పెట్లోకి తీసుకున్నారు. ప్రధానంగా మైన్లకు అనుమతులు ఇవ్వడంలో వేమిరెడ్డిదే తుది నిర్ణయంగా మార్చుకున్నారు. దీంతో జిల్లాలోని ఎమ్మెల్యేలందరితో అంతర్గతంగా విభేదాలు ప్రారంభమయ్యాయి. అక్రమ క్వార్ట్జ్ మైనింగ్‌తో ఆయన ఇప్పటి వరకు సంపాదించుకున్న కీర్తి ప్రతిష్టలు ఒక్కసారిగా మంటగలిసిపోయాయి. ప్రస్తుతం ఆయన పరిస్థితి నియోజకవర్గాల్లో జరిగే కార్యక్రమాలకు ఎంపీగా ఉన్న వేమిరెడ్డిని ఆహ్వానించడానికి ఎమ్మెల్యేలు ఇష్టపడనంతగా తయారైంది. ఇటీవల ఆత్మకూరులో జరిగిన అలఘనాథస్వామి ఆలయంలో జరిగిన కుంభాభిషేకం కార్యక్రమంలో వేమిరెడ్డి దంపతులు పాల్గొన్నారు. ఆ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే, మంత్రి ఆనం రామనారాయణరెడ్డి కానీ, ఆయన కుటుంబీకులు కానీ ఎవరూ పాల్గొనకపోవడంపై చర్చనీయాంశంగా మారింది. ఉదయగిరిలో జరిగిన శ్రీనివాస కల్యాణోత్సవంలో వేమిరెడ్డి దంపతులు పాల్గొన్న ఈ కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే కాకర్ల సురేష్ డుమ్మా కొట్టారు. పార్లమెంట్ సభ్యుడిగా నియోజకవర్గ పర్యటనలో స్థానిక ఎమ్మెల్యేలు పాల్గొనకపోవడంపై రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఇటీవల మంత్రి ఆనంతో కాకర్ల అంటకాగుతూ తిరుగుతున్నాడు. కానీ ఎంపీ పర్యటనకు డుమ్మా కొట్టడం చూస్తే ఎన్నికల్లో వాడుకునేందుకే వేమిరెడ్డిని కీర్తించారు. ఇప్పుడు కరివేపాకులా తీసిపారేశారనే ప్రచారం జరుగుతోంది.

సోమిరెడ్డి నయా రాజకీయం



త్వరలోనే మంత్రి వర్గ విస్తరణ ఉండొచ్చనే ప్రచారం ఊపందుకోవడంతో మంత్రి పదవి కోసం పలువురు ఎమ్మెల్యేలు పాకులాడుతున్నారు. ఇటీవల నెల్లూరు డీఆర్‌సీ సమావేశం జరిగిన రోజు మాజీ మంత్రి, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి స్థానిక ఎమ్మెల్యేలకు విందు ఏర్పాటు చేయడంపై రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది. ఈ సందర్భంగా సోమిరెడ్డి మాట్లాడుతూ మంత్రి వర్గ విస్తరణ జరిగితే ప్రస్తుతం ఉన్న ఇద్దరు మంత్రుల్లో ఒకరు ఔట్ అయ్యే అవకాశం ఉందని, ఆ స్థానంలో తన పేరు సూచించాలని మంత్రి పొంగూరు నారాయణతోపాటు పలువురు ఎమ్మెల్యేలను వేడుకున్నట్లు ప్రచారం జోరుగా జరుగుతోంది. విందు ఏర్పాటు చేసి మంత్రి పదవి చర్చ పెట్టడంపై మరికొందరు ఆశావహులు అవాక్కైనట్లు తెలుస్తోంది. మంత్రి వర్గంలో సీటు కోసం అధిష్టానం వద్ద మెప్పు పొందేందుకు తరచూ మీడియా సమావేశాలు పెట్టి ఉచ్చనీచాలు, స్థాయిని మరిచి మాజీ సీఎం వైఎస్ జగన్‌పై సోమిరెడ్డి అవాకులు చవాకులు మాట్లాడుతుండడం ప్రజలు అసహ్యించుకుంటున్నారు.

ఎవరికి వారే ప్రయత్నాలు

మంత్రి వర్గ విస్తరణ రేసులో సోమిరెడ్డి, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డితోపాటు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ఉన్నారు. ఎవరికి వారు అమాత్య పదవి కోసం పాకులాటలో పొలిటికల్ గేమ్ ఆడుతున్నారు. తాజాగా జిల్లాలో జరిగిన పలు రాజకీయ పరిణామాలను అవకాశంగా మలచుకుంటూ కోటంరెడ్డి మైండ్‌గేమ్‌తో ముందు వరసలోకి వచ్చాడనే ప్రచారం కూటమి శ్రేణుల్లోనే చర్చ జరుగుతోంది. లోకేశ్‌తో ఉన్న సన్నిహిత సంబంధాలతో మంత్రి పదవి తన చివరి వాంఛ అంటూ సెంటిమెంట్ గేమ్ ఆడుతున్నట్లు సమాచారం. ఒక వేళ మంత్రివర్గ విస్తరణ జరిగితే మంత్రి ఆనం పదవికి గండం తప్పదని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. జిల్లాలో సీనియర్ రాజకీయ నేతగా అనుభవం ఉన్న ఆనం మంత్రి పదవి దక్కినప్పటికీ నుంచి అధికార యంత్రాంగాన్ని తన గుప్పెట్లో పెట్టుకునేందుకు నానా హంగామాలు సృష్టించారు. ఒక దశలో మంత్రి నారాయణ ఆదేశాలను సైతం కాదని తన ఆదేశాలను అమలు చేయించుకోవడంతో పైచేయిగా వ్యవహరించారు. తాజా పరిస్థితుల్లో తన పదవిని కాపాడుకునేందుకు అధిష్టానం వద్ద మెప్పు పొందేందుకు ఆయన ఇటీవల మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై దారుణమైన వ్యాఖ్యలు చేశారు. ఆయన విమర్శలు రాజకీయ వర్గాల్లో యావగింపుగా మారింది. అధికార పార్టీలో జరిగే తాజా రాజకీయ పరిణామాలపై మంత్రి ఆనం కినుక వహిస్తూ తన సొంత వర్గాన్ని కూడగట్టుకుంటున్నారనే ప్రచారం లేకపోలేదు.

డబుల్ ఇంజిన్ సర్కార్‌తో అప్పుల ఊబిలోకి రాష్ట్రం

- ఏడాదిలోనే రూ.1.75 లక్షల కోట్ల అప్పులు
- చంద్రబాబు, నారాయణ చేతిలో 54 వేల ఎకరాలు
- మరో 40 వేల ఎకరాలకు స్కెచ్
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ



ర్యాలీలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, జిల్లా నేతలు

నెల్లూరు (వీఆర్సీసెంటర్): డబుల్ ఇంజిన్ సర్కార్‌తో అభివృద్ధి పరుగులు తీస్తుందని కూటమి పార్టీల నేతలు ప్రచారం చేశారని, అయితే ఏడాది కాలంలోనే అభివృద్ధి సంగతి పక్కన పెడితే అప్పుల ఊబిలోకి రాష్ట్రం కూరుకుపోతుందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ఆందోళన వ్యక్తం చేశారు. 14 నెలల్లో రాష్ట్ర ప్రభుత్వం రూ.1.75 లక్షల కోట్ల అప్పు చేసిందని విమర్శించారు. సీపీఐ నెల్లూరు జిల్లా 26వ మహాసభలు ఆదివారం ప్రారంభమయ్యాయి. మూడు రోజుల పాటు జరిగే ఈ మహాసభల్లో తొలిరోజు కలెక్టరేట్ దగ్గర నుంచి సీపీఐ నాయకులు, కార్యకర్తలు కోటమిట్టలోని షాదీమంజిల్ వరకు ర్యాలీ నిర్వహించారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ మాట్లాడుతూ దేశంలో వందేళ్ల చరిత్ర కలిగిన పార్టీలు కాంగ్రెస్, సీపీఐ మాత్రమే అని, ఏనాడు అప్రజాస్వామ్యకంగా ఓట్లు దొంగిలించి అధికారంలోకి రాలేదన్నారు. స్వాతంత్ర్య పోరాటంలో లేని బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్‌లు ప్రజల ఓట్లను దొంగలించి నేడు దేశాన్ని పాలిస్తున్నాయన్నా రు. త్వరలో బిహార్ రాష్ట్రంలో జరగనున్న ఎన్నికల్లో ఓట్లను కొల్లకొట్టి దొంగ ఓట్లను నమోదు చేసి అధికారంలోకి రావాలని కుట్ర పన్నుతోందని ఆరోపించారు.

అమరావతి పేరుతో రూ.వేల కోట్ల అప్పులా?

అమరావతి అభివృద్ధి పేరుతో రూ.68 వేల కోట్లు అప్పు తీసుకొచ్చామని మంత్రి నారాయణ చెబుతుంటే, చంద్రబాబు మాత్రం రూ.78 వేల కోట్లని చెబుతున్నారని, ఇంత అప్పులు చేసి ఎవరిపై భారాన్ని పెట్టాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ప్రశ్నించారు. ఇప్పటికే 54 వేల ఎకరాలను చంద్రబాబు, నారాయణ తమ చేతుల్లో పెట్టుకున్నారని, ఇంకా మరో 40 వేల ఎకరాల భూమి కోసం ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. అమరావతి రాజధాని ప్రాంతం చిన్నపాటి వర్షానికి మునిగిపోయిందన్నారు. ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా ఒక రైల్వేస్టేషన్ నిర్మాణానికి 15 వేల ఎకరాలు కావాలని చంద్రబాబు చెప్పటం విడ్డూరంగా ఉందన్నారు. కూటమిలో భాగస్వామ్యం ఉన్న బీజేపీని రాష్ట్రానికి రావాలసిన విభజన హామీల అమలు, పోలవరం ప్రాజెక్ట్ ఎత్తు తగ్గించే విషయంపై, విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపటం, కడపలో స్టీల్ ఫ్యాక్టరీ నిర్మాణంపై అడిగే ధైర్యం చంద్రబాబు లేదన్నారు. విద్యుత్ చార్జీలు పెంచమని వీలైతే తగ్గిస్తామని, స్మార్ట్ మీటర్ల ఏర్పాటును అడ్డుకుంటామని చెప్పి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం రూ.వేల కోట్లు విద్యుత్ చార్జీలు పెంచారని, స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేయటం సిగ్గు మాలిన చర్య అన్నారు. కరేడులో రైతుల భూములను బలవంతంగా లాక్కుని కార్పొరేట్ సంస్థకు అప్పగించడం సరి కాదన్నారు. రైతులతో పెట్టుకుని చంద్రబాబు పెద్ద తప్పు చేస్తున్నాడని, రైతులతో పెట్టుకున్న మోదీనే చివరకు క్షమాపణ చెప్పారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శివర్గ సభ్యులు రావుల వెంకయ్య, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జగదీష్, ఈశ్వరయ్య, హరనాథ్‌రెడ్డి, ఏఐటీయూసీ రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రటరీ వెంకటసుబ్బయ్య, జిల్లా కార్యదర్శి దామా అంకయ్య, నగర కార్యదర్శి అరిగెల నాగేంద్రసాయి, సీనియర్ నాయకులు పముజుల దశరథరామయ్య, నాయకులు సిరాజ్, షాన్‌వాజ్, వినోదిని, శిరీషా పాల్గొన్నారు.

నెల్లూరు అడ్డాగా గంజాయి



గతంలో గాయపడిన నెల్లూరు రూరల్ డీఎస్పీ శ్రీనివాసరావు (ఫైల్)



నేడు గాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కానిస్టేబుల్ ఆరోగ్యపరిస్థితిని తెలుసుకుంటున్న ఈగల్ విభాగ ఐజీ, ఎస్పీ

- బరితెగిస్తున్న స్మగ్లర్లు
- అడ్డొచ్చిన వారిపై దాడులు

నెల్లూరు (క్రైమ్): కూటమి ప్రభుత్వం వచ్చాక జిల్లా గంజాయికి అడ్డాగా మారింది. ఆదివారం తెల్లవారుజామున నెల్లూరులోని ఎస్వీజీఎస్ కళాశాల వద్ద జాతీయ రహదారిపై జరిగిన సినీఫక్కీ ఛేజింగ్ ఘటన ఇందుకు అద్దం పడుతోంది. విశాఖ, ఒడిశా సరిహద్దుల నుంచి వ్యాపారులు భారీ స్థాయిలో గంజాయిని దిగుమతి చేసుకుని గుట్టుచప్పుడు కాకుండా విక్రయాలు సాగిస్తున్నారు. విద్యార్థులు, యువతే లక్ష్యంగా వ్యాపారం సాగుతోంది. ఇక్కడి నుంచి కేరళ, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలకు పెద్ద ఎత్తున గంజాయి తరలివెళుతోంది. గంజాయిని కట్టడి చేయాల్సిన పోలీసులు, ఎక్సైజ్, ఈగల్ టీంలు మొక్కుబడి చర్యలకే పరిమితమయ్యారు. దీంతో గంజాయి స్మగ్లర్లు బరి తెగిస్తున్నారు. గంజాయి తరలింపు సమయంలో అడ్డుపడిన వారిని అంతమొందించేందుకు స్మగ్లర్లు వెనుకాడడం లేదు. గతేడాది ఆగస్టులో విశాఖ ఏజెన్సీ నుంచి తిరుపతికి కారులో ముగ్గురు దుండగులు పెద్ద ఎత్తున గంజాయి తరలిస్తున్నారని జిల్లా పోలీసులకు సమాచారం అందింది. దీంతో నెల్లూరు రూరల్ డీఎస్పీ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో వెంకటాచలం, మనుబోలు పోలీసులు వెంకటాచలం టోల్‌ప్లాజా వద్ద వాహన తనిఖీలు చేపట్టారు. గంజాయి తరలిస్తున్న వాహనాన్ని అడ్డుకునే ప్రయత్నం చేయగా నిందితులు కారును ఆపినట్లు ఆపి ముందుకు దూసుకెళ్లారు. ఈ క్రమంలో డీఎస్పీతోపాటు పలువురు పోలీసు అధికారులకు గాయాలయ్యాయి. అప్పట్లో ఈ ఘటన రాష్ట్ర వ్యాప్తంగా కలకలం సృష్టించింది. కారు డ్రైవర్‌ను అరెస్ట్ చేసిన పోలీసులు మిగిలిన నిందితులను త్వరలోనే పట్టుకుంటామని వెల్లడించారు. పోలీసు అధికారులు కొంత కాలం విస్తృత తనిఖీలు చేపట్టారు. కాలక్రమేణా నిఘా కొరవడడం, తనిఖీలు తగ్గుముఖం పట్టడం గంజాయి అక్రమార్కులకు కలిసి వచ్చింది. దీంతో గంజాయి అక్రమరవాణా, విక్రయాలు జోరందుకున్నాయి.

ఏడాది తర్వాత..

ఏడాది అనంతరం సరిగ్గా ఇలాంటి ఘటనే ఆదివారం నెల్లూరు జాతీయ రహదారిపై చోటు చేసుకుంది. అల్లూరి సీతారామరాజు మన్యం జిల్లా నుంచి కారులో 22 కేజీల గంజాయిని నెల్లూరులోని వ్యాపారికి ఇచ్చేందుకు తీసుకువస్తున్నారని పక్కా సమాచారం పోలీసు బాస్‌కు అందింది. ఆయన ఆదేశాల మేరకు బాలాజీనగర్ ఇన్‌స్పెక్టర్ జాతీయ రహదారిపై తన సిబ్బందితో కలిసి కాపు కాశారు. పెన్నాబ్రిడ్జి వద్ద నుంచి గంజాయి తరలిస్తున్న కారును వెంబడించారు. ఎస్వీజీఎస్ కళాశాల వద్ద కారు యూటర్న్ తీసుకుంటున్న సమయంలో పోలీసులు కారును చుట్టుముట్టడంతో గంజాయి కోసం అక్కడికి వచ్చిన ఇద్దరు వ్యక్తులు పరారయ్యారు. కారు డ్రైవర్ తప్పించుకునేందుకు కారును పోలీసులపైకి దూకించారు. ఈ ఘటనలో ఈగల్ కానిస్టేబుల్‌కు గాయాలయ్యాయి. ఇన్‌స్పెక్టర్ సాంబశివరావు కారును వెంబడిస్తూ కారుపై కాల్పులు జరిపి పరారవుతున్న నిందితుడిని పట్టుకున్నారు. గంజాయి తరలించేక్రమంలో అడ్డుకునేవారు ఎవ్వరైనా సరే చంపేందుకు వెనుకాడబోరని తాజా ఘటన స్పష్టం చేస్తోంది.

వైఎస్సార్‌సీపీ హయాంలో ఉక్కుపాదం

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో జిల్లాలో గంజాయి ముఠాలపై ఎస్‌ఈబీ, పోలీసు అధికారులు ఉక్కుపాదం మోపారు. పీడీయాక్ట్‌లు నమోదు చేసి జైళ్లకు పంపడంతో గంజాయి విక్రయాలకు ఫుల్‌స్టాప్ పడింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పరిస్థితులు మారిపోయాయి. గంజాయి అక్రమ రవాణాను అడ్డుకునే పోలీసులపై స్మగ్లర్లు బరితెగించిన ఘటనలు వైఎస్సార్‌సీపీ పాలనలో జరగలేదు. కూటమి నేతల అండదండలు చూసుకుని స్మగ్లర్లు రెచ్చిపోతున్నారనే ఆరోపణలు లేకపోలేదు. గంజాయి విక్రేతలకు, వ్యాపారానికి కూటమి నేతలు అండగా ఉండడంతో పోలీసుల నిఘా కూడా కొరవడింది. మత్తు మాదక ద్రవ్యాల కట్టడికి ఏర్పాటు చేసిన ఈగల్ వ్యవస్థ నామమాత్రపు చర్యలకే పరిమితమైందన్న విమర్శలున్నాయి. మొక్కుబడి దాడులకే అధికారులు పరిమితమవడం, నిందితులపై నామమాత్రంగానే చర్యలు ఉండటంతో గంజాయి అక్రమార్కులు చెలరేగిపోతున్నారు. మత్తులో నేరాలు అధికమయ్యాయి. మునుపెన్నడూలేని విధంగా పోలీసులపై దాడులకు తెగబడడం చూస్తుంటే పరిస్థితి తీవ్రత ప్రత్యేకించి చెప్పాల్సిన అవసరం లేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు పక్కా ప్రణాళికలతో గంజాయి అక్రమ రవాణ, విక్రయాలను పూర్తిస్థాయిలో కట్టడి చేయడంతో పాటు నిందితులపై కఠినంగా వ్యవహరించాల్సిన అవసరం ఉంది.

పచ్చమూకల అరాచకం

- మంచినీటి శుభ్రతపై ప్రశ్నించాడని వ్యక్తిపై దాడి
- ఈ ఘటనను వీడియో తీశాడని మరో వ్యక్తిని విచక్షణా రహితంగా కొట్టిన వైనం




వీరేంద్రపై దాడి చేస్తున్న టీడీపీ నేతలు

వరికుంటపాడు: మండలంలోని గణేశ్వరపురంలో పచ్చమూకలు చెలరేగిపోయారు. గ్రామంలో సరఫరా చేసే మంచినీటి శుభ్రతపై ప్రశ్నించాడని ఒక వ్యక్తిని శనివారం విచక్షణా రహితంగా దాడి చేశారు. ఈ ఘటనను వీడియో తీశాడని మరో వ్యక్తిని ఆదివారం సినిమా ఫైట్లను తలపించే రీతిలో దాడికి తెగబడ్డారు. గ్రామ నడిబొడ్డున పట్టపగలు జరిగిన ఈ ఘటన చూసిన గ్రామస్తులు భీతిల్లారు. స్థానికులు, బాధితుడు తెలిపిన సమాచారం మేరకు.. గణేశ్వరపురంలోని ప్రభుత్వ మినరల్ వాటర్ ప్లాంట్‌ను బోనముక్కల నాగేశ్వరరెడ్డి నిర్వహిస్తున్నారు. ప్లాంట్‌లో వాటర్ సక్రమంగా శుద్ధి చేయకపోవడంపై శనివారం నాగేశ్వరరావును గ్రామానికి చెందిన బాదం మాధవరెడ్డి నిలదీశారు. నీరు శుభ్రంగా లేవని, ఈ నీరు తాగితే విషజ్వరాలు వచ్చే అవకాశం ఉందని, మంచి నీరివ్వాలని అడిగారు. ఈ క్రమంలో మమ్మిల్నే ప్రశ్నిస్తావా అంటూ నాగేశ్వరరెడ్డి గొడవ పడ్డాడు. ఈ విషయం నాగేశ్వరరెడ్డి కొడుకు భాస్కర్‌రెడ్డి తెలియడంతో ప్లాంట్ సమీపం నుంచి ఇంటికి వెళ్తున్న మాధవరెడ్డిని ఆపి గొడవ పడి దాడికి పాల్పడ్డాడు. ఈ ఘటనను అక్కడే ఉన్న శింగంరెడ్డి వీరేంద్రరెడ్డి తన సెల్‌ఫోన్‌లో చిత్రీకరించాడు. ఇది గమనించిన భాస్కర్‌రెడ్డి అనుచరుడు వీరేంద్రపై దాడికి పాల్పడ్డాడు. దీంతో అతను డయల్ 100కు కాల్ చేసి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో మరింత రెచ్చిపోయిన టీడీపీ నేతలు ఆదివారం పక్కా ప్రణాళికతో దాడి చేయాలని కాపు కాచారు. ఈ క్రమంలో తన 15 నెలల చంటి బిడ్డను తీసుకుని నడిచి వెళ్తుండగా వీరేంద్రపై టీడీపీ దుండగులు చంటి బిడ్డ ఉన్నాడని కూడా చూడకుండా వీరేంద్రరెడ్డిపై దాడికి పాల్పడ్డారు. సినిమా ఫైట్లను తలపించే రీతిలో కర్రలతో అతన్ని కొట్టి గాయపరిచారు. తీవ్రగాయాలతో బాధితుడు ఆత్మకూరు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స నిమిత్తం చేశాడు. ఈ దాడి ఘటన వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో ఎస్సై రఘునాథ్ గ్రామంలో విచారణ చేపట్టారు. ఇరు వైపులా ఫిర్యాదులు అందాయని విచారణ చేసి తగిన చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు.

రేయింబవళ్లు మట్టి అక్రమ రవాణా

- మామూళ్ల మత్తులో రెవెన్యూ అధికారులు
- రెండు ట్రాక్టర్లు పోలీసులు స్వాధీనం



పోలీస్‌స్టేషన్ వద్దనున్న ట్రాక్టర్లు

సోమశిల: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తొలి రోజు నుంచే టీడీపీ నాయకులు బరితెగించి మండలంలో విచ్చలవిడిగా అక్రమ గ్రావెల్ రవాణా సాగిస్తున్నారు. ఈ అక్రమార్కులకు అడ్డుకట్ట వేయాల్సిన రెవెన్యూ, మైనింగ్ అధికారులు అటువైపు కన్నెత్తి కూడా చూడడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. అనంతసాగరం మండలంలో శనివారం, ఆదివారం రోజుల్లో విచ్చలవిడిగా గ్రావెల్ రవాణా సాగించారు. వడ్డిపాళెం నుంచి మినగల్లులోని ప్రధాన రహదారిపై నిర్మిస్తున్న వేబ్రిడ్జి వద్దకు, దేవూరు నుంచి శంకరనగరం గ్రామానికి ట్రాక్టర్లతో వందల ట్రిప్పులు తరలిస్తున్నారు. దీంతో ట్రాక్టర్ల నుంచి గ్రావెల్ జారి రోడ్డుపై పడడంతో చిరు వర్షానికి తారు రోడ్లు బురద మయంగా మారుతుందని వాహనదారులు వాపోతున్నారు. మినగల్లుకు గ్రావెల్ తరలిస్తున్నారని తహసీల్దారు జయవర్ధన్‌కు గ్రామస్తులు సమాచారం ఇవ్వగా వీఆర్వోను పంపుతానని చెప్పి ఎటువంటి చర్యలు తీసుకోకుండా అక్రమార్కులకు సహకరిస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ విషయం వాట్సప్ గ్రూపుల్లో చక్కర్లు కొట్టడంతో ఆదివారం సాయంత్రం పోలీసులు మినగల్లు వద్ద రెండు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించారు. ఎస్‌ఐ సూర్యప్రకాష్ మాట్లాడుతూ రెండు ట్రాక్టర్లు మాత్రమే దొరికాయని, మిగతా ట్రాక్టర్ల డ్రైవర్లు పరారయ్యారన్నారు.

ఎన్నాళ్లు తిరగాలో..!

అన్నదాత సుఖీభవకు రెవెన్యూ చిక్కులు

- వెబ్‌ల్యాండ్‌లో పేర్లు, ఆధార్ అప్‌డేట్ కాని వైనం
- వేలమందికి ఇప్పటికీ జమకాని నిధులు
- వివరాలు సరిచేయాలని దరఖాస్తులు
- పట్టించుకోని రెవెన్యూ అధికారులు
- కార్యాలయాల చుట్టూ తిరుగుతున్న రైతులు

అన్నదాత సుఖీభవ నిధులు జమ చేశామని కూటమి నేతలు సంబరాలు చేస్తున్నారు. అయితే వెబ్‌ల్యాండ్‌లో దొర్లిన తప్పుల్ని చూపించి వేలమందికి ఈ పథకాన్ని దూరం చేశారు. సమస్యల్ని పరిష్కరించాలని రైతులు దరఖాస్తు చేసుకోగా రెవెన్యూ అధికారులు చుక్కలు చూపిస్తున్నారు. కార్యాలయాల చుట్టూ అన్నదాతలు కాళ్లరిగేలా తిరుగుతున్న పరిస్థితి నెలకొంది.



కందుకూరు: అన్నదాత సుఖీభవ పథకం అమలులో ప్రభుత్వ డొల్లతనం బయటపడుతోంది. ప్రతి రైతు బ్యాంక్ ఖాతాలో నిధులు జమ చేశామని ప్రభుత్వం ఊదరగొడుతున్నా క్షేత్రస్థాయిలో మాత్రం పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. అన్ని అర్హతలున్నా జిల్లాలో వేలమంది పేర్లు అర్హుల జాబితాలో లేకుండా పోయాయి. సుమారు 6,615 మంది రైతులు ఇప్పటికీ డబ్బులు పడలేదంటూ అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. అయినా సమాధానం చెప్పేనాథుడు కరువయ్యాడు.

ఇవీ కారణాలు

ప్రధానంగా భూముల వివరాలు నమోదు చేసే వెబ్‌ల్యాండ్‌లో తప్పులు దొర్లడమే. ఆధార్ నంబర్ తప్పుగా ఉండటం, నమోదు, మ్యుటేషన్‌లు కాకపోవడం తదితరాలున్నాయి. వాస్తవానికి రీసర్వే పూర్తయిన గ్రామాల్లో రైతుల భూములకు సంబంధించిన వివరాలు సక్రమంగా నమోదు చేయాలి. అయితే 1,236 మంది రైతుల వివరాలు వెబ్‌ల్యాండ్‌లో తప్పుగా నమోదయ్యాయి. అలాగే రీసర్వే కాని గ్రామాల్లో 5,379 మందికి సంబంధించిన వివరాలు సక్రమంగా లేవు. మొత్తంగా 6,615 మంది రైతులకు నిధులు జమ చేయలేదు. వివరాలు సరిచేయాలని వీరంతా రెవెన్యూ అధికారులకు దరఖాస్తు చేసుకున్నారు. అత్యధికంగా సీతారామపురం మండలంలో 748, దగదర్తిలో 629, అల్లూరులో 644, సైదాపురంలో 613, కొండాపురంలో 720, ఉలవపాడులో 436, విడవలూరులో 259, రాపూరులో 439, పొదలకూరులో 396, లింగసముద్రంలో 426, కందుకూరులో 264 మంది అత్యధికంగా ఉన్నారు. మిగిలిన మండలాల్లో పదుల సంఖ్యలో ఉన్న రైతులు తమ వివరాలు సరిచేయాలని దరఖాస్తు చేసుకున్నారు. కానీ రెవెన్యూ అధికారులు మాత్రం వీటి గురించి పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



రమాదేవి ఆధార్ నంబర్‌తో ప్రభుత్వ ఉద్యోగి కుటుంబంగా చూపిస్తూ..

దూరమయ్యే పరిస్థితి

వెబ్‌ల్యాండ్‌లో భూములకు సంబంధించిన వివరాలు తప్పులు ఉండటంతో ఒక్క అన్నదాత సుఖీభవకే కాకుండా ఇతరత్రా ప్రభుత్వ పథకాలకు కూడా ఆయా రైతులు దూరమయ్యే పరిస్థితి ఉంది. ఆధార్ వివరాల తప్పు, భూముల సర్వే నంబర్లకు సంబంధించిన వివరాలు వెబ్‌ల్యాండ్‌లో తప్పుగా నమోదు కావడంతో అనర్హులుగా తేల్చారు. ఒకరి పేరుపై ఉన్న భూమిని మరొకరి పేరుపైకి మార్చే మ్యుటేషన్స్ పెండింగ్‌లో ఉన్నాయి. ఇటువంటి సమస్యలు పరిష్కరించాలని రైతులు రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. వాస్తవానికి క్షేత్రస్థాయిలో వీఆర్వోలు విచారణ చేసి తహసీల్దార్‌కు నివేదిక ఇస్తే వారు ఆమోదించి వెబ్‌ల్యాండ్‌లో తప్పులు సరిచేయాల్సి ఉంది. అయితే అధికారులకు మామూళ్లు ఇవ్వకపోతే పని జరిగే పరిస్థితి లేదు. దీంతో ఈ ఏడాదికి సంబంధించి అన్నదాత సుఖీభవ నిధులు వేల మంది రైతులకు వచ్చే అవకాశం లేకుండా పోయింది. క్షేత్రస్థాయిలో ఇలా ఉన్నా ప్రభుత్వం మాత్రం ప్రతి రైతుకు ఇచ్చామంటూ గొప్పలు చెప్పుకోవడం గమనార్హం.

సమాధానం లేదు



నా పేరుపై రెండున్నర ఎకరాల పొలం ఉంది. అన్నదాత సుఖీభవ డబ్బులు ఇప్పటి వరకు రాలేదు. అధికారులను అడిగితే మాది ప్రభుత్వ అధికారుల కుటుంబం అని చెబుతున్నారు. నాకు తెల్లరేషన్ కార్డు ఉంది. మా ఇంట్లో ప్రభుత్వ ఉద్యోగాలు చేసేవారు లేరు. అయినా అది సాకుగా చూపి నాకు డబ్బులు వేయలేదు. ఎన్ని సార్లు అధికారుల చుట్టూ తిరిగినా సమాధానం చెప్పడం లేదు.

– ఎం.రమాదేవి, మహిళా రైతు, మోపాడు

నేటి నుంచి వెంకయ్య స్వామి ఆరాధనోత్సవాలు



విద్యుద్దీపాలంకరణలో వెంకయ్య స్వామి ఆశ్రమం

వెంకటాచలం: దక్షిణ భారతదేశంలో ప్రసిద్ధి చెందిన గొలగమూడిలోని భగవాన్ వెంకయ్య స్వామి 43వ ఆరాధనోత్సవాలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈనెల 24వ తేదీ వరకు జరిగే ఉత్సవాలకు సంబంధించి ఏర్పాట్లను చేస్తున్నారు. తొలిరోజు ఉదయం 10 గంటలకు సర్వభూపాల వాహనసేవ, రాత్రి 9 గంటలకు కల్పవృక్ష వాహన సేవ, 19న ఉదయం 10 గంటలకు సూర్యప్రభ వాహనసేవ, రాత్రి 9 గంటలకు చంద్రప్రభ వాహనసేవ, 20న ఉదయం 10 గంటలకు హనుమంత సేవ, రాత్రి 9 గంటలకు హంస వాహనసేవ, 21న ఉదయం 10 గంటలకు చినశేష వాహనసేవ, రాత్రి 9 గంటలకు గజ వాహనసేవ, 22న ఉదయం 10 గంటలకు అశ్వ వాహనసేవ, రాత్రి 9 గంటలకు పెద్ద శేష వాహనసేవ, 23న ఉదయం 10 గంటలకు సింహ వాహనసేవ, రాత్రి 9 గంటలకు గరుడ వాహనసేవ నిర్వహించనున్నారు. చివర రోజు ఉదయం రథోత్సవం, రాత్రి 8 గంటలకు తెప్పోత్సవం జరుగుతాయి. ఉత్సవాల్లో భాగంగా రోజూ వేకువ జామున రెండు గంటలకు స్వామి సుప్రభాత సేవ, అభిషేకం రాత్రి 7 గంటలకు హారతి, ప్రసాద్ వినియోగం చేయనున్నారు.

క్లుప్తంగా

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

నెల్లూరు(క్రైమ్): దంపతుల నడుమ విభేదాల నేపథ్యంలో ఓ వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన నెల్లూరు వేదాయపాళెం రైల్వేస్టేషన్ సమీపంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. సంజయ్‌గాంధీ నగర్‌కు చెందిన ఎస్.శ్రీకాంత్ (36), రాజ్యలక్ష్మి ప్రేమ వివాహం చేసుకున్నారు. వారికిద్దరు సంతానం. శ్రీకాంత్ యూనియన్ బ్యాంక్‌లో మెసెంజర్‌గా కాంట్రాక్ట్ పద్ధతిపై పనిచేస్తుండగా రాజ్యలక్ష్మి సచివాలయ ఉద్యోగిని. కొంతకాలంగా దంపతుల నడుమ విభేదాలు చోటుచేసుకున్నాయి. తరచూ గొడవ పడుతుండేవారు. ఈనెల 16వ తేదీ రాత్రి భర్త, అత్తింటివారిపై వేదాయపాళెం పోలీసులకు రాజ్యలక్ష్మి ఫిర్యాదు చేసింది. పోలీసులు శ్రీకాంత్, అతని తల్లిని విచారించారు. అనంతరం శ్రీకాంత్ తల్లిని ఇంటి వద్ద వదిలి పని ఉందంటూ బయటకు వెళ్లాడు. వేదాయపాళెం రైల్వేస్టేషన్ సమీపంలోని చెట్టుకు ఉరేసుకుని ఉండటాన్ని ఆదివారం ఉదయం స్థానికులు గమనించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్ మార్చురీకి తరలించారు. మృతుడి తల్లి సంపూర్ణమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు



బ్రాయిలర్ : రూ.123
లేయర్ : రూ.118
బ్రాయిలర్ చికెన్ : రూ.224
స్కిన్‌లెస్ చికెన్ : రూ.250
లేయర్ చికెన్ : రూ.200

చలో కరేడుకు ‘కూటమి’ ఆంక్షలు

- 144 సెక్షన్ అమలు
- బారికేడ్లు ఏర్పాటు చేసిన పోలీసులు
- కూటమి ప్రభుత్వంపై రైతులు, వివిధ సంఘాల ఆగ్రహం



కరేడు ర్యాంపు వద్ద బైక్ ఆపి వివరాలు తెలుసుకుంటున్న పోలీసులు

ఉలవపాడు: భూసేకరణకు వ్యతిరేకంగా సోమవారం తలపెట్టిన చలో కరేడు కార్యక్రమంపై కూటమి ప్రభుత్వం ఆంక్షలు విధించింది. ఈ కార్యక్రమానికి అనుమతి లేదని, రైతు సంఘాలు వస్తే చర్యలుంటాయని పోలీసు శాఖ చెబుతోంది. ఇప్పటికే గ్రామాన్ని తమ గుప్పెట్లోకి తీసుకుంది. బయట వ్యక్తులు రాకుండా ఊరికెళ్లే మూడు దారుల్లో బారికేడ్లను ఏర్పాటు చేశారు. గ్రామంలోకి వెళ్లే ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలిస్తూ, వివరాలు అడిగి మరీ పంపుతున్నారు. అంతే కాకుండా గ్రామ సచివాలయం వద్ద, బస్టాండ్ సెంటర్‌లో పోలీసులు మఫ్టీలో తిరుగుతూ ప్రజల కదలికలను గమనిస్తున్నారు. 144 సెక్షన్ అమలులో ఉందని జనం గుమికూడవద్దని తహసీల్దార్ శ్రీనివాసరావు చెప్పినట్లుగా వీఆర్‌ఏలు వాట్సాప్ గ్రూపుల్లో పోస్టులు పెడుతున్నారు. మరోవైపు రైతు సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో మాజీ మంత్రి వడ్డే శోభనాదీశ్వరరావుతోపాటు వివిధ రైతు సంఘాలు, వామపక్ష నాయకులు చలో కరేడు కార్యక్రమాన్ని నిర్వహిస్తామని చెబుతున్నారు. రైతులు తమ సమస్యలను శాంతియుతంగా తెలియజేయడానికి చేస్తున్న కార్యక్రమాలను ప్రభుత్వం ఎందుకు పోలీసులతో తొక్కిపెట్టాలని చూస్తోందని వారు ప్రశ్నిస్తున్నారు. పోలీసు శాఖ సహకరించాలని కోరుతున్నారు.

రైతులకు అవమానం

కూటమి ప్రభుత్వం పోలీస్ శాఖ ద్వారా రైతులను భయపెట్టాలని చూస్తోందని రైతు సంఘాల జేఏసీ నాయకులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. చలో కరేడును వాల్‌పోస్టర్లను చించివేయడమే కాకుండా వాటిని అంటించిన అమాయక గిరిజనులను అరెస్ట్ చేయడం, గ్రామంలో 144 సెక్షన్ ఉందని బెదిరించడం చేయడం బాధాకరమన్నారు. ఉద్యమం వల్ల ఇప్పటికీ ఎలాంటి లా అండ్ ఆర్డర్ సమస్య తలెత్తలేదన్నారు. కూటమి ప్రభుత్వం రైతులను అవమానిస్తోందన్నారు. రైతు ఉద్యమానికి మద్దతుగా ఉన్న వామపక్ష పార్టీల నాయకులను కూడా సింగరాయకొండలో అరెస్టు చేశారని, ఇది తప్పన్నారు.



నిందితులు, స్వాధీనం చేసుకున్న వాహనాలతో ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు, సిబ్బంది

ఇద్దరు బైక్ దొంగల అరెస్ట్

- మూడు వాహనాల స్వాధీనం

నెల్లూరు(క్రైమ్): బైక్ దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరు దొంగలను పోలీసులు అరెస్ట్ చేశారు. ఆదివారం నెల్లూరు వేదాయపాళెం పోలీస్‌స్టేషన్‌లో ఇన్‌స్పెక్టర్ కె.శ్రీనివాసరావు వివరాలను వెల్లడించారు. పొదలకూరురోడ్డు హెచ్‌ఆర్ కళ్యాణ మండపం సమీపంలో ఈనెల తొమ్మిదో తేదీన తిరుపతి జిల్లాకు చెందిన మునిశంకర్ బైక్‌ను గుర్తుతెలియని దుండగులు ఎత్తుకెళ్లారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఇన్‌స్పెక్టర్ తన సిబ్బందితో కలిసి బైక్ దొంగతనాల కట్టడికి చర్యలు చేపట్టారు. ఆదివారం బుజబుజనెల్లూరు జాతీయ రహదారి పాతమల్లారెడ్డి ధాబా సమీపంలో అనుమానాస్పదంగా ఉన్న నెల్లూరు రూరల్ మండలం వైఎస్సార్ నగర్‌కు చెందిన వి.శ్రీకాంత్, మూలాపేట కసాయివీధికి చెందిన షేక్ ఖలీల్‌ను అదుపులోకి తీసుకున్నారు. నిందితులు హెచ్‌ఆర్ కళ్యాణ మండపం, బాలాజీనగర్, సంతపేట పోలీసుస్టేషన్ల పరిధిలో మూడు బైక్‌లను ఎత్తుకెళ్లినట్లు బయటపడింది. వారిని అరెస్ట్‌చేశామని ఇన్‌స్పెక్టర్ చెప్పారు. శ్రీనివాసరావు, ఎస్సై జి.నవీన్‌కుమార్, పీఎస్సై యు.సాయికల్యాణ్, సిబ్బందిని డీఎస్పీ సింధుప్రియ అభినందించారు.

నిమ్మ ధరలు (కిలో)
పెద్దవి : రూ.40
సన్నవి : రూ.30
పండ్లు : రూ.15

వైభవంగా రాపూరమ్మ జాతర



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

రాపూరు: రాపూరమ్మ జాతర వైభవంగా జరుగుతోంది. ఆదివారం గ్రామస్తులు అమ్మవారి ఆలయంలో పొంగళ్లు పెట్టారు. భక్తులు పెద్ద సంఖ్యలో రావడంతో సందడి నెలకొంది. రాత్రి గ్రామోత్సవాన్ని నిర్వహించారు. అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ట్రాక్టర్‌లో ఉంచి వివిధ రకాల పుష్పాలు, ఆభరణాలతో అలంకరించి పురవీధుల్లో ఊరేగించారు.

కండలేరులో 28.230 టీఎంసీలు

రాపూరు: కండలేరు జలాశయంలో ఆదివారం నాటికి 28.230 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ గజేంద్రరెడ్డి తెలిపారు. సోమశిల జలాశయం నుంచి కండలేరుకు 6,840 క్యూసెక్కుల నీరు చేరుతోందన్నారు. కండలేరు నుంచి సత్యసాయి గంగ కాలువకు 1,750, పిన్నేరు కాలువకు 30, లోలెవల్ కాలువకు 40, మొదటి బ్రాంచ్ కాలువకు 80 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు వెల్లడించారు.



మహిళలపై టీడీపీ నాయకుల దాడి

వరికుంటపాడు: మండలంలోని ఎస్సీ కాలనీలో ఆదివారం ఉదయం ఇంటి స్థలం విషయంలో వివాదం నెలకొంది. స్థానికుల కథనం మేరకు.. పూర్వీకుల నుంచి వచ్చిన స్థలంలో దేవండ్ల సుధాకర్ బేస్‌మెంట్ పనులు చేపడుతుండగా ఇసుకపల్లి గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు యేదుపాటి రమణయ్య, దేవవరపు బాబు, యేదుపాటి వెంకటరత్నంతోపాటు కొంతమంది మహిళలు అక్కడికి చేరుకుని నిర్మాణాన్ని ధ్వంసం చేశారు. కూలీలుగా వచ్చిన మహిళలు దేవండ్ల సరోజనమ్మ, పీట్ల సాయమ్మ, పల్లపు లక్ష్మీదేవి, ఇంకా సుధాకర్, ఆయన తల్లి రత్తమ్మపై దాడి చేసి, కళ్లలో కారం కొట్టారు. మహిళల తలపై గాయాలయ్యాయి. వారు ఉదయగిరి ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఫిర్యాదు చేసేందుకు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లగా ‘మీరే కూర్చొని సమస్య పరిష్కరించుకోండి’ అని పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరించారని బాధితులు ఆరోపించారు.



ధ్వంసమైన బేస్‌మెంట్

రూ.2 కోట్లు మట్టిపాలు



దెబ్బతిన్న రహదారి



- మూణ్ణాళ్ల ముచ్చటగా రోడ్డు

సైదాపురం: మండల కేంద్రమైన సైదాపురంలో మినరల్ గ్రాంట్ కింద రూ.2 కోట్లతో వేసిన రోడ్డు దెబ్బతింది. నిర్మాణ సమయంలో సంబంధిత అధికారుల పర్యవేక్షణ లోపించడంతో ఈ రహదారి దారుణంగా మారింది. కైవల్యా నది వంతెన వద్ద నుంచి రాపూరుకు వెళ్లే దారిలో రెండు కిలోమీటర్ల మేర రోడ్డు దెబ్బతినగా కొంతకాలం క్రితం కలెక్టర్ ప్రత్యేక మినరల్ గ్రాంట్ మంజూరు చేశారు. సంబంధిత కాంట్రాక్టర్ హడావుడిగా పనులు పూర్తి చేశారు. కాగా పనులు పూర్తయిన రెండు నెలల్లోనే రోడ్డు దెబ్బతిని యథాస్థితికి చేరుకుంది. అయితే ఇంత వరకు మరమ్మతుల గురించి పట్టించుకోకపోవడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. సంబంధిత కాంట్రాక్టర్‌కు నోటీసులు జారీ చేశామని ఆర్అండ్‌బీ అధికారులు చెబుతున్నారు గానీ పనులు మాత్రం జరగడం లేదు.

దొంగల హల్‌చల్

కలువాయి(సైదాపురం): మండలంలోని పెన్న బద్దెవోలు గ్రామంలో శనివారం రాత్రి దొంగలు హల్‌చల్ చేశారు. మెయిన్ సెంటర్ రామాలయంలో రూ.లక్ష విలువ చేసే రెండు మంగళసూత్రాలు, రెండు కాసులు, అంగన్‌వాడీ సెంటర్‌లో 210 కోడి గుడ్లు, 30 కిలోల బియ్యం, రెండు నూనె ప్యాకెట్లు చోరీ చేశారు. ఆదివారం ఎస్సై కోటయ్య ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

నూర్‌బాషా సంఘ జిల్లా కమిటీ ఎన్నిక

నెల్లూరు రూరల్: నూర్‌బాషా బీసీ ముస్లిం సంక్షేమ సంఘ జిల్లా నూతన కమిటీని నగరంలోని టౌన్‌హాల్ ఏసీ హాల్లో సంఘ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఖాదర్‌బాషా ఆధ్వర్యంలో ఆదివారం ఎన్నుకున్నారు. సంఘ జిల్లా గౌరవాధ్యక్షుడిగా ఖాసిం, జిల్లా అధ్యక్షుడిగా బాబర్‌జాన్, జిల్లా ఉపాధ్యక్షులుగా ఖాజారహంతుల్లా, కాలేషా, ప్రధాన కార్యదర్శిగా ఖాజామస్తాన్, ట్రెజరర్‌గా మస్తాన్‌సాహెబ్, జిల్లా యూత్ అధ్యక్షుడిగా సుభాన్‌బాషా, జనరల్ సెక్రటరీగా అక్బర్, టౌన్ అధ్యక్షుడిగా హుస్సేన్, టౌన్ జనరల్ సెక్రటరీగా హబీబ్ ఎన్నికయ్యారు. అనంతరం వీరిని సత్కరించారు.



నూతన కమిటీకి సన్మానం

అల్లకల్లోలంగా కోడూరు తీరం



అల్పపీడన ప్రభావంతో మండలంలోని కోడూరు, వెంకన్నపాళెంలో సముద్రం అల్లకల్లోలంగా మారింది. ఆయా ప్రాంతాల్లో ఆదివారం సముద్రం సుమారు 25 నుంచి 30 అడుగుల మేర ముందుకు చొచ్చుకొని రావడంతో తీరం కోతకు గురవుతోంది. ఉవ్వెత్తున ఎగిసిపడుతున్న అలలతో తీర ప్రాంతవాసుల్లో భయాందోళన వ్యక్తమవుతోంది. మత్స్యకారులు వేటకు విరామం పలికి ఇళ్లకే పరిమితమయ్యారు. చలిగాలులు అధికమయ్యాయి.

– తోటపల్లిగూడూరు